# మిలట్రీబొమ్మ

పైడిపల్లి సత్యానంద్

సత్తిబాబు ఆవులించాడు.

ఆవులిస్తూనే అందరి పిల్లలతో బాటు "రెండెళ్ళు పద్దెమిళ్ళు ముప్పై యారాళు...." అన్నాడు. దూరంగా నల్లబోర్డు పక్కనున్న నల్లుల కుర్చీలోని మేష్టారు బెత్తంతో బద్ధకంగా, కుర్చీకోడుమీద కొడుతూ, చిరాకుగా రెండో యెక్కం పిల్లలచేత వల్లింపజేస్తున్నాడు. పిల్లలు ఆ పాకస్కూలు పైకప్పు లేచేటట్టు ఘొల్లుమంటూ ఎక్కం డొక్క చింపేస్తున్నారు.

సత్తిబాబు మళ్ళీ ఆవులించి 'బెత్తం మేష్టారు'కేసి చూసాడు. ఆ నారాయణ మేష్టార్ని పిల్లలందరూ సదా బెత్తం మేష్టరు అనే పిలుచుకుంటారు. ప్రాణం పోయినా ఆయన ఇబ్బంది పడడేమోగాని, బెత్తం పోతే ఊరుకోడుఆయన. ఆ బెత్తం ఆయినకి ఆసరా. ఆయుధం. ఆభరణం.

"ఒరేయ్ పిల్లకాయలూ.... కాసేపు నోళ్ళు మూసుకూర్చోండి. కిక్కురుమంటే చర్మం ఒలుస్తా...." ఓ ఆర్డరు ఓ టెరిబుల్ వార్నింగ్ ఇచ్చి నీరసంగా కళ్ళుమూసుకున్నాడాయన. నాలుగు నెలలబట్టి గ్రాంటుకాని జీతాలు, ఇంట్లో ఈదురోగోడా అంటూ గోడదగ్గర మంచంమీద పడుకునివుండి ముసల్తల్లి. ముప్ఫయి ఏళ్ళ క్రితం బంగారుబొమ్మలా వుండి, ప్రస్తుతం తుప్పట్టినపాతసినారేకుబొమ్మలా వున్న పెళ్ళాం, రోగాలతో-రొచ్చులతో దిష్టిబొమ్మల్లా వున్న పిల్లలు. తరుచూ వెలగని పొయ్యిలో పడుకునే పిల్లులు, ఒంట్లోనూ, ఇంట్లోనూ, కళ్ళలోనూ ఉండే చీకటి, ఓన్నప్పుడు వచ్చిన ఎక్కాలనే మళ్ళీమళ్ళీ చెప్పుకుంటూ గడిపేసిన ఇరవై అయిదేళ్ళు అన్నీ తలచుకుంటూ బెత్తం ఒళ్ళో పెట్టుకుని కూర్చున్నారు బెత్తం మేష్టారు.

గంట ఎప్పుడు మోగుతుందాఅని ఆలోచిస్తున్నారు ఆయన.

ఆఆలోచనతో సత్తిబాబుఆలోచనకూడా ఏకీభవిస్తుంది.

సత్తిబాబుకూడా గంట ఎప్పుడు కొడతారా అని అనుకుంటున్నాడు.

పాకతో వున్న ఆ పాతగది కిటికీ

లోంచి ఎర్రటి సాయింసంధ్య, లోపలికి పల్చగా పడుతోంది. బెత్తం మేష్టారి వార్నింగ్ లెక్కలేనట్లుగా రణగొణధ్వని చేస్తున్నారు. బుల్లిసూరిగాడు మంచి బొంగరాలు ఎక్కడ దొరుకుతాయో వివరంగా ఓ ఇద్దరికి వివరిస్తున్నాడు. ఊరు చివర దేరాలో ఉన్న 'సరకసు' గురించి గందరగోళంగా చెపుతున్నాడు చంద్రరావు. తన పెనిపిలు పారేసి, తెలీదంటోన్నందుకు మొద్దురావుడిని నాలుగు కోట్టేసి, కసితీరక "బెల్లుకానీరా .... బయిటున్నయి నీకు కాజాలు." అని బెదిరిస్తున్నాడు సోంబాబుగాడు, మొద్దురావుడు 'బెల్లెప్పుడవుద్దా' అని బెంగెట్టేసుకున్నాడు. మహలక్ష్మి వరాలుకి 'సుక్కలాట' నేర్పుతోంది. శివయిగాడు వాచికం వాడికి తెలీకుండా చింగినందుకు, కళ్ళనీళ్ళెట్టుకుని, మేష్టర్ని మినహాయించి అందర్నీ అనుమానించి బూతులెట్టుకుంటున్నాడు. కేశవలు గాడు వాడుమొన్న చూపిన 'ఎన్టీవోడి స్టంట్‌సినిమాలోని కుస్తీ లని అభినయిస్తూ రవణమ్మని, రాజమ్మని సీతని ఝడిపిస్తున్నాడు. క్లాసు క్లాసులా లేదు. జూనియర్ కురుక్షేత్రంలా వుంది.

సత్తిబాబుకి మాత్రం 'గంటెప్పుడవుద్దా' అని వుంది.

అందుకు కారణం వుంది. సత్తిబాబు మళ్లీ ఆవులించాడు. మేష్టరుకేసి చూసాడు. వాడు అప్పుడెప్పుడో రోడ్డుమధ్యగుంపులో ఎవడో ఓ పాముకీ: ముంగిసకీ దెబ్బలాట పెట్టడం చూశాడు. పెద్దపాము, చిన్న ముంగిస. రెండూ చాలాసేపు కొట్లాడుకున్నాయి. ఆ కొట్లాటలో అప్పుడప్పుడు ఆ పాము, ముంగిసకి భయపడి వెర్రిముండలాగ ముడుచుకుపోయేది. అలా ముడుచుకున్న పాములాగ అనిపించారు కర్చీలోని బెత్తం మేష్టారు వాడి మనసుకి! ఏడాది నుంచీ బడికివస్తున్న తనకే 'విసుగ్గా' ఎప్పుడు పోదామా అనివుంది....పాపం ఏోళ్ళఏళ్ళనుంచీ వచ్చే మాష్టారుకి పోదాం అనిపించదా.... విసువు వెయ్యదా....అని పిస్తుంది అప్పుడప్పుడు వాడికి.

కాని బెత్తం మేష్టారుకి, బడిమీదేకాక బతుకుమీదే విసుగ్గా వుందని బళ్ళోంచి.... ఊళ్లోంచేకాక భూమ్మీంచే పోదాం అని పిస్తుందని వాడికి తెలీనే లేదు.

గంట కొట్టారు.

పిల్లలు లబ, లబ లాడుతూ.... తోసుకుంటూ...., తొక్కుకుంటూ .... కేకలు వేస్తూ.... పరుగెడుతున్నారు. నెత్తురు నరకంలోంచి, పెనుభూతపుపిడికిలిలోంచి. పువ్వులలోకి, నవ్వులలోకి వెళుతూన్నట్టు పరుగెడుతున్నారు. బెత్తంమేష్టరు స్కూలు అనే బాధలోంచి, కొంప అనే భయంలోకి వెళ్ళాలని విచారంగా ఒళ్లు విరుచుకుని లేచారు.

సత్తిబాబు అందర్నీ తోసుకుంటూ వీధిలోకి వచ్చాడు. వేగంగా ఉషారుగా నడుస్తున్నాడు.

సన్నటి ఆ సందులో అక్కడోటీ, ఆక్కడోటీ విసిరేసినట్టు ఉన్నాయి వేప

చెట్లు. చెట్ల ఆకుల్లోంచి. ఎర్రటి సాయం సంధ్య నెత్తురు డాగుల్లాగ నేలమీద పడుతోంది. పరుగెడుతున్న పిల్లల అలజడికి, అక్కడా అక్కడా వున్న కాట్లకుక్కలు అటూ, యిటూ పరుగెడుతున్నాయి. రోడ్డు ప్రక్కన చెప్పలకొట్టు సోమయ్య, బిచాణా ఎత్తేస్తున్నాడు. సాయంకాలపుచల్లగాలిమెల్లిగా వీస్తోంది. ఎండిన ఎంగిలాకులు, ఎవరి కోసమో ఎగిరెగిరి ఎటో పడుతున్నాయి.

సత్తిబాబు ఉషారుగా నడుస్తున్నాడు.

వాడి ఉషారుకి బడి వదలటం అనేది కారణం కాదు. మరో ముఖ్య కారణం వుంది....

"నాన్నారు మిలట్రీ బొమ్మ తెచ్చేసుంటారు." అనుకున్నాడు.

వేగంగా నడుస్తున్నాడు.

సుమారు పదిహేనురోజులక్రితం సత్తిబాబు వాళ్ళ నాన్నారితో కలిసి బొమ్మల కొట్టుకి వెళ్ళాడు. నాలుగునెల్లున్న మూడో పిల్లకి ఓ గిలక్కాయ కొనాలని, కొనమని పెళ్ళాం పదేపదే చెప్పగా దాని ఖరీదు పదణాలు అని తెలిసి, ఓ రూపాయి జేబులో వేసుకుని, పెద్దాడ్ని వెంటేసుకుని బొమ్మల కొట్టుకి వెళ్ళాడు సూర్నారాయణ. రంగుల దీపాల వెలుగులో రంగురంగులబొమ్మల్తో ఆ కొట్టు 'బొమ్మల లోకం'లా అనిపించింది సత్తిబాబుకి. అద్దాల బీరువాల్లో పెద్దవీ చిన్నవీ, చితకవీ, అన్నీ కనిపించాయి. వాడికి. ఆ కొట్లో అమ్మకంజరిపే తెల్లచొక్కా ఆసాములు, పెద్ద పెద్ద బొమ్మ



ల్లాగ కాసేపు - బొమ్మలువున్న అదృష్టవంతుల్లాగ కాసేపు అనిపించారు వాడి ప్రాణానికి. కానీ వాళ్ళ నాన్నారికి ఆయన ప్రాణానికి "డబ్బుల్లోచేసే దొంగ వేధ

వల్లా....'' అనిపించారు వాళ్ళు. వాళ్ళ నాన్నగారు తక్కువ వెలలో, ఎక్కువ చప్పుడుచేసే మేలురకం గిలక్కాయని ఎంచుకునే ప్రయత్నంలో వుండగా సత్తిబాబు ఆయన చెయ్యి విడిపించుకుని, బొమ్మలు తనిఖీకి బయల్దేరాడు. లాగూ, చొక్కా వేసుకున్న కోతిబొమ్మ వాడికి బావుంది డప్పువాయించే ఎలుగుబంటి వాడికి నచ్చింది, గడుగ్గాయిలా కళ్ళుకదిపే దొరసానిబొమ్మ వాడికి కావాలనిపించింది ఆటోమేటిక్ పిస్టల్ వాడికి పట్టుకుపోవాలనిపించింది. సింహం బొమ్మ, చేపలవాడి బొమ్మ, గుర్రంబొమ్మ వాడికి తప్పకుండా కొనుక్కోవాలనిపించింది. ఆ తరవాత వాడు చూసాడు మిలట్రీ బొమ్మని. ఆ మిలట్రీవాడి నెత్తిన ఎర్రటోపీ వుంది. చేతిలో ఓ తుపాకీ వుంది. కాళ్ళకి బూట్లు, సాక్సులు వున్నాయి. ఆ మిలట్రీవాడు చాలా ధీమాగా చూస్తున్నాడు. ''నన్ను కొనుక్కోరా సత్తిబాబూ....'' అంటోన్నట్టున్నాడు వాడు.

సత్తిబాబు ఆ మిలట్రీబొమ్మకేసిచూస్తూ వుండిపోయాడు.

అద్దానికి మొహం ఆన్చి, కళ్ళు పెద్దవి చేసి, ఆ బొమ్మకేసి చూస్తూ వుండిపోయాడు.

ఆబొమ్మ వుండాలి. తనకి వుండాలి. అనుకున్నాడు వాడు

ఆ బొమ్మలేకపోతే బ్రతుకు నిరర్థకమనిపించింది వాడికి.

ఆ మిలట్రీవాడికి వెనకాల ఓ 'కీ' వుంటుందని, ఆ కీ ఇస్తే వాడు అటూ ఇటూ కవాతు చేస్తాడని వాడికి తెలుసు. సరిగ్గా అలాటిబొమ్మనే వాడు ఓ నెలక్రితం చిట్టిగాడి ఇంట్లో చూసాడు. అది వాళ్ళ నాన్నగారు 'హైద్రాబాద్ నుంచి తెచ్చారని చిట్టిగాడు చెప్పాడు! కీ యిచ్చిచూపించాడు కూడాను.... 'అలాటిది ప్రపంచంలో ఒకటే వుందనీ, అదికాస్తా వాళ్ళనాన్నారు కొనేసారని' చిట్టిగాడు చెబితే సత్తిబాబు కాస్త బాధపడ్డాడు.

ఇంకోటుంటే మా నాన్న కొనేశును'' అన్నాడు. ఇంటికి వచ్చేశాడు. ఇప్పుడు ఈ మిలట్రీబొమ్మ చూడగానే అలాటిది ఇంకోటికూడా వుందని అనుకున్నాడు.

వెంటనే ఆలస్యం చెయ్యకుండా ఆ ఒక్కటీ కొనేసుకోవాలని అనుకున్నాడు.

''నాన్నారు....'' అని పిలిచాడు.

గిలక్కాయకి అరపైసలుయిచ్చి మిగిలిన సలభైపైసలు లెక్క చూసుకుంటున్న సూన్నారాయణ—''ఏంట్రా బాబూ....'' అని వాడివైపు తిరిగారు.

సత్తిబాబు వేల్తో మిలట్రీబొమ్మకేసి చూపించాడు.

''మిలట్రీవాడి బొమ్మ బావుందొరేయ్ బావుంది....''బొమ్మని అప్రిషియేట్ చేశాడు సూన్నారాయణ ఖర్చులేని పనికనక.

''నాక్కావాలి....'' సత్తిబాబు చల్లచల్లగా చావుకబురులా చెప్పాడు.

''కొనుక్కుందాం....మళ్లీవచ్చి కొను

క్కుందాం....'' సూన్నారాయణ, సత్తిబాబు చెయ్యి పట్టుకుని బైటకి బయల్దేరాడు

సత్తిబాబు మొరాయించాడు. "నాకది కొనూ...." తలాయించి అడిగేశాడు.

ఈ లోపల కొట్లో తెల్లబట్టలఆసామి, కుర్రాడి మోజు కనిపెట్టేసి "ఇదా బాబూ" అంటూ మిలట్రీవాడిని బయిటకి తీసి, బల్లమీద పెట్టి కీ యిచ్చి వదిలాడు. మిలట్రీవాడు హూందాగా, దర్జాగా, ఓ నాలుగడుగులు వేసి మళ్ళీ బిగుసుకు పోయాడు.

"ఆ బొమ్మకోసం...." అన్నాడు సత్తిబాబు.

"ఎంతండీ అది...." సూన్నారాయణ బితుకు, బితుకు మంటోనే అడిగాడు.

"ట్వల్వ్ రుపీస్...." చిన్నగానవ్వాడు తెల్లచొక్కావాడు.

సూన్నారాయణ కాళ్ళు చల్లబడ్డాయి.

వెధవ బొమ్మ పన్నెండ్రూపాయరా... దారుణం, ·దారుణం, భూమ్మీద పాపం ఎక్కువైపోతోంది అనుకున్నాడు.

"ఒరేయ్ బాబూ— మళ్ళీవచ్చి కొనుక్కుందాం...." సూన్నారాయణ, సత్తిబాబుని బుజ్జగించబోయాడు. 'నాన్నారు,


# ఇంప్‌కాప్స్‌లో సమస్తమూ యంత్రాలచే నిర్వహించబడుతున్నది

## కాగా ఇంప్‌కాప్స్ నికార్సయిన అయుర్వేద, సిద్ధ, యునానీ మందులకు పెట్టినది పేరు

దేశీయ వైద్యులు కొందరుచేరి 1944వ సంవత్సరంలోనే సహకార పద్ధతులపైన ఒక ఫార్మశీని స్థాపించారు నికార్సయిన ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందులను తయారుచేయడం, దేశీయ ఓషధులలో పరిశోధనలు సాగించడం, ప్రాచీన భిషగ్వరుల సూత్రాలను ప్రామాణికం చేయడం ఈ సంస్థ లక్ష్యాలు. భవిష్యత్తుపైన పరిపూర్ణ విశ్వాసంతో పురోగమించింది. ఇప్పుడు పూర్తిగా అధునాతన పద్ధతులపై యంత్రాలతోనే మందులను తయారు చేయడం సాధించి, ప్రజలకు సేవ జేయడానికి అర్హత సంపాదించుకున్నాము ప్రజలను ఆరోగ్యవంతులను గాను, శక్తిమంతులనుగాను చేసి, దేశాన్ని సౌష్ఠవం చేయడానికి ఇంప్‌కాప్స్ సహాయపడుతున్నది.



**IMPCOPS**

ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్
కో-ఆపరేటివ్ ఫార్మశీ & స్టోర్స్ లిద్.,
లాటిస్ బ్రిడ్జ్ రోడ్, అడయార్, మద్రాసు-20

పెద్ద కెమిస్టులవద్ద, పెద్ద మందుల దుకాణాలలోను లభ్యం కాగలవు

ఇతర ఆఫీసులు. కాదేపల్లి పోస్టు, గుంటూరుజిల్లా, ఆంధ్ర ప్రదేశ్
20/320-ఏ, పెదిభొట్లవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
19 వైశ్య హాస్టల్ బిల్డింగ్స్ వీర సావర్కర్ రోడ్డు, హైదరాబాదు 27

అబద్ధాలుచెప్పి మోసం చేసేబోతున్నారని కనిపెట్టేసినట్టున్నాడు వాడు.... ఉహూఁ వద్దు ఇప్పుడే కొను....ఁ....ఁ" అన్నాడు.

"మళ్ళీవద్దాంలే...." రెక్కట్టుకుని కొడుకుని కదపబోయాడు

"బొమ్మాఁ...." అనే రాగం తీస్తూ, మిలట్రీ బొమ్మలా బిగుసుకు పోయాడు సత్తిబాబు. సూన్నారాయణకి కాళ్ళలోంచి కంగారు పట్టుకుంది.

"నీకు పదపైసలు ఇస్తాగా...." ఆశ పెట్టబోయాడు.

'నాకొద్దూ...' అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడి చేసాడు సత్తిబాబు

కొట్టువాడు సరదాగా చూస్తున్నాడు.

సూన్నారయణ అమాంతం కొడుకుని ఎత్తుకుని గబ, గబ కొట్లోంచి బైటకి పరుగెత్తాడు - అక్కడుంటె ఇక ప్రమాదమని.

సత్తిబాబు ఏడుపు అందుకున్నాడు.

సూన్నారయణ ఓ కిళ్లీకొట్టుదగ్గర ఆగి, రెండు చాక్లెట్స్‌కొని వాడికిచ్చాడు. ఇచ్చి 'రేపెళ్ళి కొనుక్కుందాం... ఏడవకురా బాబూ ఏడవకు....' అన్నాడు.

సత్తిబాబు చాక్లెట్స్‌ని ఓ సారిచూచి, అవి 'లంచం' అని కనిపెట్టి, అవి తింటే తాను లొంగిపోయినట్టు లెక్క అని ఊహించి, బలంగా ఎడంగా ఉన్న కాలవలోకి గిరవాటేశాడు.

సూన్నారాయణకు ఒళ్ళు మండింది.

'విళ్ళలేం చేశాయిరా అలా విసిరేశుకున్నావు...." అని కసురుకున్నాడు.

సత్తిబాబు సమాదానం చెప్పకుండా ఏడుస్తున్నాడు. సూన్నారాయణ ఇక లాభం లేదని, రిక్షా కేకేసి ఎక్కి, "వేగిరం.... వేగిరం" అంటూ, వేగంగా కొడుకుతో ఇంటికి జేరాడు.

ఇంట్లో ఏడుపు స్వాతంత్రం ఎక్కువుంది కనుక 'ఘొల్లు'మని ఏడిచాడు సత్తిబాబు.

"ఏమిట్రాఁ బాబూ.... ఏమయిందండీ వీడికి...." ఆదుర్దాగా భర్తని అడుగుతూ కొడుకుని దగ్గరికి తీసుకుంది శాంతమ్మ.

"నా తలకాయ అయింది. వెధవసంత. వెంటబెట్టుకు వెళ్ళకపోయినాబావుండును." అని విసుక్కుంటూ. బట్టలు మార్చుకుని పెరట్లోకి వెళ్ళాడుసూన్నారాయణ.అప్పుడు సత్తిబాబు ఏడుస్తూనే 'బొమ్మ' గురించి 'అమ్మ'కి చెప్పాడు.

"ఏమిటండీఁ.... మిలట్రీ బొమ్మ అంటాడు...." అని భర్తను అడిగింది ఆ ఇల్లాలు.

"ఏడిశాడు. ఆ కొట్లో ఓ మిలట్రీవాడి బొమ్మ తగులడింది.... అది కావాలని గొడవ.... వెధవ గొడవ.... వెధవ గొడవాని...."

కొన్లేక పోయారా...." ఆవిడ అంది.

"బుద్ధిలేపోతే సరి.... వెధవ మిలట్రీ వెధవ బొమ్మ .... పన్నెండురూపాయలట. మన బతుకులకి తోడు.... పన్నెండ్రూపాయిల బొమ్మ కూడానూ...."

విసుక్కుని కసురుకున్నాడు సూన్నా రాయణ.

శాంతమ్మ మరిమాట్లాడలేదు. మౌనంగా వూరుకుంది.

సత్తిబాబు మాత్రం వూరుకోలేదు. ఆ రోజు నుంచి, ప్రతీ రోజూ, సాధ్యమయినంత ఎక్కువ సమయం ఏడవసాగాడు. ఇంట్లో వున్న ఒకటీ, అర పాతబొమ్మల్ని వీధిలో పారేశాడు. అన్నం తినడం మానేశాడు. ఎప్పుడూ ఒకటే ఏడుపు-'' మిలట్రీ బొమ్మ.... మిలట్రీ బొమ్మ....''

నాలుగయిదు రోజులు శాంతమ్మ పట్టించుకోలేదు వాడి ఏడుపుని.

సూన్నారాయణ పట్టించుకుని పడ చీవాట్లెట్టే వాడు కొడుకుని.

సత్తిబాబు పట్టు వదల్లేదు.

రాత్రిళ్ళు నిద్రలో కూడ పలవరించసాగాడు,

శాంతమ్మ బెంగెట్టుకుంది,

సూన్నారాయణకి దిగులు పట్టుకుంది.

కొడుకు వాలకం చూసి భార్యాభర్తలు ఇద్దరూ కంగారు పడ్డారు.

''చిన్నవెధవ ఏదో రెండ్రోజులు ఏడిచి ఊరుకుంటాడనుకున్నారు'' గాని ఇలా పట్టువదలని విక్రమార్కుడి మార్కు కుర్రాడిలా, తయారవతాడని అనుకోలేదు.

''పోనీ ఆ బొమ్మ కొని పారేయకూడదండీ....'' ఒ రాత్రి శాంతమ్మ అంది.

మంచం మీద కూర్చున్న సూన్నారాయణ, ఇల్లాటి కళ్ళ కేసి చూసాడు-

ఇద్దరి చూపుల్లోనూ, చీకటిలో మెరుపులా, బాధ కదిలింది.

పన్నెండు రూపాయల విలువ వాళ్ళకి బాగా తెలుసు.

పన్నెండు రూపాయలు పెడితే, చిరుగుల చీరలు కట్టుకొని బ్రతికే పెళ్ళానికి ఓ చీర వస్తుందని. బీటలు పడిన చిమ్నీతో వున్న అరికెన్ లాంతరుకి బదులు కొత్త అరికెను లాంతరు వస్తుందని, తెగిపోయి డజను కుట్లతో వున్న తనచెప్పులకి బదులు కొత్తచెప్పులు వస్తాయని, రెండోపిల్లకటానిక్ సీసా వస్తుందని, ఎప్పటినుంచో సినిమా చూడాలనే కోరిక తీరుతుందని, ఆర్నెల్లక్రితం అయిపోయిన పౌడర్‌డబ్బా, పళ్ళూడిన దువ్వెన, బీటలుపడిన అద్దం వస్తాయని, తెగిన నవారున్న మంచానికి కొత్త నవారు వస్తుందని, ఓ వారం రోజులపాటు అన్నంలోకి కూరా-నారా వస్తుందని, ఇంకా, ఎన్నో.... ఎన్నెన్నో

---

## పరువైన మాట :

పల్లెటూరి రోడ్డుమీద ఒక చిన్న కారు ఆగి ఉంది. దారేపోతున్న ఒక గాడిద దానికేసి ఆశ్చర్యంగా చూసి చూసి అడిగింది. ''నువ్వెవరు?'' అని.

''నన్ను ఫియట్ అంటారు'' అంది గర్వంగా కారు, "నువ్వెవరు?'' గాడిద అటూ ఇటూ చూసి మెల్లిగా ''నేను గుర్రాన్ని" అంది.

వస్తాయని సూన్నారాయణకి తెలుసు.

శాంతమ్మకి కూడా తెలుసు.... తెలుసు....

వాళ్ళ బతుక్కి పన్నెండు రూపాయలతో - వెన్నెల వుంది. వెలుగు వుంది.

పన్నెండు రూపాయలకి - సంతోషం వుంది. సరదా వుంది.

పన్నెండు రూపాయలకి - మాధుర్యం వుంది. ఎంతో విలువ వుంది.

పన్నెండు రూపాయలలో కొన్ని గడిచే రోజులున్నాయి. వెలిగే కలలు వున్నాయి.

పన్నెండు రూపాయలకి వెలలేనిఖరీదు వుంది వాళ్ళ దృష్టిలో....




"ఓ దిక్కుమాలిన మిలట్రీ బొమ్మ కోసం పన్నెండ్రూపాయలు తగలెయ్యటం నిజంగా, ఘోరం, ఘోరం."

అందుకే ఆ రాత్రి ఆ ఆలూ-మగలూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు అలా చూసుకున్నారు. అదే సమయంలో ఏకంగా నేల మీద పడుకున్న సత్తిబాబు....నిద్దట్లో.... "మిలట్రీ....బొమ్మ...."-అని పలవరించాడు. ఒకసారి వాడికేసి చూసి, మళ్లీ సూన్నారాయణ కళ్ళల్లోకిచూసి చేతులతో మొహం దాచుకుంది శాంతమ్మ.

పెళ్ళాం ఏడుస్తోందని గ్రహించాడు సూన్నారాయణ.

ఆ నాలుగు గోడల మధ్య, గుడ్డిదీపపు వెలుగులో. చేతులలో మొహం దాచుకుని నిశ్శబ్దంగా ఏడుస్తోంది శాంతమ్మ.

ఇది జీవితం. ఇద ప్రపంచం. ఇది నిన్ను ఏడిపిస్తుంది. ఇది నిన్ను గాయపరుస్తుంది.

నీవి అతిస్వల్పమయిన కలలు.... అయినా అవి ఎప్పుడూ తీరవు.

నీ గుండెలో ఎప్పుడూ మంటలు.... అవి ఎప్పుడూ, ఆరవు, ఆరవు.

నీ బ్రతుకులో వచ్చిన పువ్వులు.... అవి మరి పుయ్యవు, పుయ్యవు.

కాసింత వెలుగు అయినా నీ ఇంటి ముందు వాకిట్లో కురియదు, కురియదు.

నీ కొడుకు ఎవడికొట్లోనో బొమ్మ కోసం ఏడుస్తాడు. నువ్వు వాడి అమ్మవయి ఏడుస్తావు. నీ మొగుడు బ్రతుకు

చేతిలో వెర్రిబొమ్మ నిలుస్తాడు.

మీ అందరూ మట్టిబొమ్మలయి, విరుగు తారు, కరుగుతారు.

ఆరాత్రి సూన్నారాయణ నిద్రపోకుండా దెయ్యంలా కూర్చున్నాడు.

తెల్లవారింది. ఆ తరవాత మరోమూడు సార్లు తెల్లవారింది.

సూర్యుడు ప్రతిరోజూ ఉదయిస్తు న్నాడు.

సత్తిబాబు ప్రతి ఉదయం 'మిల్ట్రీ బొమ్మ' గురించి అనర్గళంగా ఏడుస్తు న్నాడు.

''వెధవకి దెయ్యంగాని పట్టిందేవిటేఁ.'' సూన్నారాయణ ఉండబట్టలేక అన్నాడు.

''ఛాఁ.... అవేం ముక్కలండీ ...'', కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అందిశాంతమ్మ.

మరో రెండు రోజులు చూశాడు సూన్నారాయణ. మరి లాభం లేదను కున్నాడు. ఆ రోజు వుదయం సత్తిబాబు- శాంతమ్మ - మధ్యసుండ - కడిగొట్టుడి - అందరూ వుండగా ప్రకటించాడు - ''ఆ సాయంత్రాలం, మిలటరీ వాడి బొమ్మ తేబోతున్నట్టు.''

సత్తిబాబు నమ్మలేనట్టు ఓ సారి నాన్నకేసి చూసాడు.

ఇదేదయినా అబద్ధపు ప్రకటన ఏమో అని వాడికి వాస్త అనుమానం కలిగింది.

అది గ్రహించి ''నిజంగానే ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు పట్టుకొస్తాను....'' అని నొక్కి వక్కాణించాడు సూన్నా రాయణ.

సత్తిబాబు కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారిగా మెదిలాయి.

చాలాకాలం తుపానులో చిక్కుకున్న ఓడలోని ప్రయాణీకులికి, ఓ ఉదయం పచ్చటి సూర్యుడు, అల్లరిచెయ్యనిసాగరం, కనిపించే పచ్చటి నేల చల్లటివాతావరణం- ఒక్కసారిగా ఎదురవుతే కలిగే ఆనందం, కలిగింది వాడికి. కోటి జన్మల కోరిక తీరుతోన్నట్టు, అనిపించింది వాడికి.

నాన్నారు దేవుడిలాగా అనిపించారు వాడికి.

సత్తిబాబు నవ్వాడు.

సరదాగా నవ్వాడు.

అఁగోరా బాబూ.... బొమ్మ తెస్తా నంటున్నారు నాన్నారు. మరి ఇవాళ బడి కెళతావా.'' అంది శాంతమ్మ. తలూపాడు సత్తిబాబు.

అప్పుడు వాడు బడికి వెళ్లాడు. కొడుకు బడికి వెళ్ళాక, భర్తఅఫీసుకు వెళ్ళేముందు అడిగింది శాంతమ్మ-'' ఆ బొమ్మకి డబ్బె క్కడదండీ ఇప్పుడు-'' అని.

ఆఫీసులో సుబ్రమణ్యాన్నడిగానునిన్న. ఇవాళ ఇస్తానన్నాడు ఆఫీసులో....''

సూన్నారాయణ సమాధానం చెప్పి బయటికి నడిచాడు.

ఆ మధ్యాహ్నం సూన్నారాయణ - సుబ్రమణ్యాన్ని పన్నెండు రూపాయలు అడగటం, 'సారీ బ్రదర్ సర్దుబాటవలేదు రేపిస్తాను....' అని సుబ్రమణ్యం చెప్ప

టం, మతిపోయినవాడిలా ఆ మధ్యాహ్నపు మండుటెండలో సూర్యనారాయణ నిలబడిపోవటం. ఆ సాయంకాలం ఆఫీసు నుంచి "అగర్వాల్ పాన్ బ్రోకర్స్" దగ్గరకు వెళ్ళి, కుడిచేతి చిటికెనవ్రేలినున్న పెళ్ళినాటి ఉంగరం తాకట్టు పెట్టి ఇరవై రూపాయలు సూర్నారాయణ పుచ్చుకోవటం, ఆ చిక్కుమాలిన 'మిలట్రీబొమ్మ' వున్న బొమ్మల కొట్టుకేసి అతను నీరసంగా, బయలు దేరటం,-ఇవేవి బడినుంచి ఇంటికి వస్తోన్న సత్తిబాబుకి తెలీదు. తెలీనే తెలీదు. వాడికి తెలిసున్నదల్లా-" నాన్నారు ఇవాళ మిలట్రీబొమ్మ తెస్తారు. అన్న విషయం మాత్రమే.

సత్తిబాబు సందులోంచి రోడ్డుమీదకి వచ్చాడు. ఆ సాయంకాలం ఆ నగరపు నడిబొడ్డున, ఆ మెయిన్‌రోడ్డుమీద అందంగా పరుచుకుంది. క్లబ్బులకేసి బయిల్దేరే ఖరీదయిన కారులు. కిటకిటలాడే జనంతో. పెట, పెటలాడే బస్సులు,చేతులు ఎత్తి తడుపుకువస్తున్న చావునుంచి తప్పించుకోడానికా అన్నట్టు హడావిడిగా పరుగెత్తే ఆడవాళ్ళు, మగవాళ్లు, పిల్లలు పెద్దలు ... అంతా సందడి. అంతా అలజడి.

ఆ సాయింకాలం - అమెరికన్ మ్యూజిక్‌కి అంగాంగం అదిలించి, విదిలించి, నీ కళ్ళముందు కదిలించే కేబ్‌రట్ డాన్సర్‌లా వుంది.

ఆ సాయం సంధ్య - నీ జవరాలి నునులేత చెక్కిళ్ళపై విరబూసిన కెంపు వెన్నెల. సిగ్గుల, నిగ్గుల నిగ నిగలాగ వుంది.

ఆ సంధ్యాకాల రక్తిమ నీ ప్రేయసి అరుణాధర తాంబూల రక్తిమలాగవుంది. సత్తిబాబుకి ఆ సాయంకాలం బొమ్మల కొట్టులాగ, ఆ మనుషులు కీ యిచ్చిన బొమ్మలు లాగ, కార్లు కీ కార్లులాగ, అనిపిస్తున్నాయి. సత్తిబాబుకి ఇంటిపట్ల సరదా ఎక్కువయ్యింది.

'మిలట్రీవాడి బొమ్మట్టుకుని సిట్టిగాడింటికి పోవాల. పేరునాయుడు అట్టాంటిసి పెపంచకంలో ఓటే వుంటుందని కోసేశాడు. ఇది సూపించి ఇంకోటికూడా వుందొరేయ్ ఎర్రినాయాలా.... అని సెప్పాలి. నా బొమ్మ సూసి ఎధవ సూపు తేల్చేస్తాడు. అడికివ్వను, ఇవ్వను గాక ఇవ్వను, వాడిది నాకిస్చేదేటి? ఆ బొమ్మ ఎంకులుగాడికి, సుబ్బిగాడికి, మొద్దు అప్పిగాడికి సూపించాలి. ముట్టుగోనియ్యను. 'కీ' నానే త్రిప్పి సూపిత్తాను. అల్లందరూ "ఒరేయ్ సత్తీ ఓమారివ్వరా." అని బతిమాలెత్తారు అప్పుడు నాను వెసకమాకూడదు. అల్లందరూ కిందవడి దొల్లేసి, సచ్చినా యివ్వను. రేతిరి బొమ్మలపెట్టిలో పెట్టి తాలం ఎయ్యాల. దొంగనాయాళ్లు కొట్టేసినా కొట్టేగలు....

సత్తిబాబులో ఉషారెక్కువయింది.

ఎగ్జైట్‌మెంట్‌తో వాడి మనసు వాడిని ఉపేస్తోంది. అదే సమయంలో

రోడ్డుకి అటుపక్కన బొమ్మలకొట్టు కనిపించింది వాడికి. బొమ్మలకొట్టు ఒకటే కనిపిస్తే బాగానే వుండును, ఆ కొట్లోకి వెళుతున్న సూర్నారాయణ కనిపించాడు.

"నాన్నారు మిలట్రీ బొమ్మ కోసవే" సత్తిబాబు పట్టరాని ఆనందంతో రోడ్డుకి అడ్డంపడి బొమ్మల కొట్టువైపుపరుగెట్టాడు.

ఆ క్షణంలో కొట్లోనితెల్లబట్టలఆసామి సూర్నారాయణతో-

"సారీ సార్ ఆ మిలట్రీ బొమ్మలు అయిపోయాయి నెక్స్టు వీక్‌లో మళ్లీ వస్తాయి" అంటున్నాడు.

సూర్నారాయణకి గుండెకాయ ఎవరో దెయ్యపుచేత్తో పట్టినలిపినట్టయింది. అతనికి కళ్ళముందు మిలట్రీబొమ్మ, ఆ తరవాత సత్తిబాబు, ఆ పైన తెల్లబట్టల ఆసామీ వరసగా కనిపించారు.

ఆ తెల్లబట్టల వాడిని చావగొట్టి బొమ్మలన్నీ పిరగ్గొట్టి. కొట్టుకి నిప్పెట్టా లనిపించింది సూర్నారాయణకి.

నీరసంగా కొట్లోంచి బయటకివచ్చాడు. అప్పుడు అతనికి రోడ్డుమధ్య ఓ ఆగిన లారీ, దానిచుట్టూ జనం, గుంపు, గడబిడ కనిపించింది. గుంపు దగ్గరికి వెళ్ళాడు సూర్నారాయణ.

గుంపులో అందరూ తలోమాట అంటు న్నారు. తలోమాట వింటున్నారు. ప్రాణం వుందా.... ఏమిటీ.... ఇంకెక్కడుం టుంది సార్.... సీయర్లీ.... ఆస్పత్రి.... త్వరగా.... నోయూజ్ మాష్టారూ.... లారీ వెధవలకి ఈ మధ్య ఒళ్లుపొగరెక్కిం దండీ.... ఓలమ్మో బుర్ర పుచ్చకాయల్లే బద్దలయినాదే.... దూరంగా వుండండి.... పాపం.... చిన్నకుర్రాడండీ.... ఆయన కండీ.... మిమ్మల్నే.... రక్తం బాగా పోయింది.... ఇంతకీ డ్రయివర్ ఏడి సార్ ... అప్పే చూశ్శేమండి ... మిమ్మ ల్నేవడు చూడమన్నారండీ ... ఆస్పత్రికి రాల్ ... పోలీస్.... ఎవరిపిల్లాడో.... పుస్తకాలు అవిగో సార్ ...తగిలకండి.... శ్రీరామచంద్రా లేచి ఎవడి మొఖం చూసాడో.... నోనో పోలీసులు రావా లండి.... గెంటకండీ.... శివశివా.... హియీజ్ డెడ్.... అయ్యొయ్యో మర గయా.... దారుణం లెండి.... లారీ నంబర్ నోట్ చెయ్యండి ... మిజర బుల్.... తప్పుకోండి మెదడు వైటకి వచ్చేసిందండీ.... డ్రయివర్ తప్పు లేదండీ ... కుర్రాడే అడ్డుగా వచ్చాడ టండీ.... నా కళ్ళతో చూశాసార్.... ఏమయినా మన దేశంలో యాక్సిడెంట్‌లు ఎక్కువయ్యాయి.... అమెరికాలో మరీ నటండీ.... మందుగొట్టి స్టీరింగ్ పుచ్చు కుంటె ఇకనే మరి.... అబ్బబ్బ.... చక్రం తలఎక్కేసిందండీ ...దారుణం.... శివశివా... ఎడ్రస్ ఎలాగండి ... మాష్టారు నాకాలు తొక్కేస్తున్నారు.... అంతాదేవుడి దయే.... వుండండి.... ఆస్పత్రి ... అరె.... పోలీసు....

సూర్నారాయణ గుంపులోంచి ఆ

మధ్యన వున్న నేలమీద ఆ శవాన్ని ఒంగి చూసాడు. అంతే! అతనికి కళ్ళలో గున పాలు గుచ్చినట్లయ్యింది. సత్తిబాబు బుర్ర బద్దలయి మాంసపు ముద్ద బయిటికి వచ్చేసింది....

"నాన్నా... సత్తీ ..." గుంపులోని మాటలని, ఆ రణగొణ ధ్వనిని ఆ సాయంకాలాన్ని చీల్చేటట్టు భయంకరంగా అరిచాడు సూర్నారాయణ. అందరూ అతని వైపు చూసారు.

సూర్నారాయణ ఓ క్షణం కొడుకు శవంకేసి చూసి పిచ్చివాడిలా "నే చూళ్ళేను.... నే చూళ్ళేను... నో ఐకాంట్ సీ...." అని అరుస్తూ వెనక్కి, వెనక్కి అడుగులు వేస్తున్నాడు. అతని కళ్ళ లోంచి కన్నీళ్ళు రావడం లేదు. అవి గడ్డ కట్టాయి: అతని గొంతులోంచి మాట రావటం లేదు. అది మూగబోయింది, ఆతని మనస్సుకి మతి పోయింది. అందరూ అతన్నే చూస్తున్నారు.

హఠాత్తుగా మరో సారి...."బాబూ... సత్తీ...." అని అరిచి వెనక్కి, వెనక్కి అడుగులు వేస్తూ కళ్ళు మూసుకున్నాడు.

అంతే! నువ్వు వెనక్కి, వెనక్కి అడుగువెయ్యాలి. బ్రతుకు నీ మీదకి భూతమై వస్తుంది, నీ కళ్ళు మూతలు పడాలి. నీ చుట్టూ చీకట్లు నిండాలి. నీ నవ్వుల నావ, నెత్తురు మడుగులో మునిగి పోవాలి. నీ పువ్వుల బుటక్కి పాములు పుట్టలు పెట్టాలి, నీ బ్రతుకుని ఏదో రోజు దెయ్యపు కాలు రాసిస్తుంది. నీ కొడుకుని 'మిలట్రీ బొమ్మ' పిశాచమై మింగేస్తుంది.

మూసుకో కళ్లు మూసుకో....


నడువు వెనక్కి నడువు..

ఆ లారీ ముందు నెత్తురు మడుగులో మాంసం ముద్దలా పడివున్నాడు సత్తిబాబు. పగిలిన తల తాలూకు కళ్లు నీకేసే చూస్తున్నాడు, ఆ మెదడులో ఏ కోరికా లేదు. ఆ కళ్లలో ఏ కలా లేదు.

ఆ కుర్రాడిలో ఏ మాత్రం ప్రాణం లేదు.

ఇక, ఇప్పుడు సత్తిబాబుకి మిలట్రీ

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
OO1.337/1 10




బొమ్మ వద్దనేవద్దు.

ఆ పన్నెండు రూపాయిలలో వాళ్ళమ్మ చీర కొనేసుకోవచ్చు వాళ్ళ నాన్న చెప్పులు కొనుక్కోవచ్చు, ఇంటికి వెల్లేయించుకోవచ్చు. ఇంట్లోకి దీపం కొనుక్కోవచ్చు చెల్లాయికి టానిక్ కొనవచ్చు. భోంచెయ్యచ్చు.

'ఆ పన్నెండు రూపాయిలతో మీరు ఏదయినా కొనేసుకోండి... నాకు మిలట్రీ బొమ్మ వద్దు'- అన్నట్టున్నాడు నెత్తురు మడుగులో సత్తిబాబు.

ఇక సత్తిబాబుకి మిలట్రీ బొమ్మ మీరు కొనక్కర్లేదు. కొనక్కరలేదు,

అ తరువాత పది రోజులు పోయాక, పేవ్మెంట్ మీద నడుస్తున్న సూన్నారాయణ బొమ్మల కొట్టు ముందు ఆగి రోడ్డు మధ్యకి చూసాడు.

అక్కడ ఏమీ లేదు....

ఎవరో అతని భుజం మీద తట్టారు.

తల తిప్పి చూసాడు. కొట్టు గుమ్మం దగ్గర నిలుచున్నాడు బొమ్మల కొట్టతను.

నవ్వుతూ అన్నాడు.

"మిలట్రీ బొమ్మలు మా దగ్గర ఉన్నాయి.... కావాలా సార్...."

"మా బొమ్మ మా దగ్గర లేదు.... మాకు వద్దు...."

సూన్నారాయణ వెర్రివాడిలా అడుగులు వేశాడు.